క్లుప్తంగా

నేడు వీరయ్యస్వామి ఆరాధన మహోత్సవం

చాపాడు : మండలంలోని బద్రిపల్లె గ్రామంలో వెలసిన అవధూత దిగంబర వీరయ్యస్వామి దేవాలయం వద్ద బుధవారం 47వ ఆరాధన మహోత్సవ వేడుకలు నిర్వహించనున్నారు. గురుపూజ పుష్పాలంకరణతో ఆరాధన ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. బుధవారం ఉదయం 6.30 గంటలకు వీరయ్యస్వామి దివ్య జ్ఞాన మందిర సన్నిధిలో ప్రత్యేక పూజలు చేయటంతో పాటు వివిధ గ్రామాల తాలాల భజన బృందాలచే 24 గంటల పాటు నిరంతరంగా సంకీర్తనలు నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 12.30 గంటలకు స్వామి వారికి నైవేద్యం సమర్పించిన అనంతరం భక్తులకు అన్న ప్రసాదం ఉంటుందన్నారు. రాత్రి 9 గంటలకు శ్రీసాయి నాట్య కళా సమితి అద్దంకి శ్రీనివాసరావు గ్రూపు వారిచే భక్త చింతామణి పూర్తి నాటకం వేయబడును, గురువారం ఉదయం 7 గంటలకు మహా నైవేద్యం సమర్పించటం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

రేపు వేలం పాట

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శివాలయం వీధిలోని సుంకు వెంకటసుబ్బయ్య సత్రం కార్యాలయంలో గురువారం ఉదయం 11 గంటలకు సత్రంకు సంబంధించి భూముల బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఈఓ రామ చంద్రాచార్యులు ఒక ప్రకటనలో తెలిపారు. రామేశ్వరం పొలం, మాలెపాడులో ఉన్న 26 సర్వే నంబర్లలోని 162.17 ఎకరాల భూములకు సంబంధించి 3 ఏళ్ల కాల పరిమితికి ఈ వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆసక్తి గల వారు రూ.10వేలు డిపాజిట్ చేసి వేలం పాటలో పాల్గొనవచ్చని, వేలం పాట దక్కించుకున్న వారు ఒక సంవత్సరం గుత్తను వెంటనే చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. మరిన్ని వివరాల కోసం తమ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

నేడు ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం

చాపాడు : మండల పరిధిలోని విశ్వనాథపురం, రాజకొట్టాలు గ్రామాలలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వైద్యాధికారి రాజేష్‌కుమార్ తెలిపారు. ఆయా గ్రామాలలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ గ్రామాల్లోని ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను పంపిణీ చేయనున్నారు. ఈ అవకాశాన్ని ఆయా గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి కోరారు.

ప్రైవేటు విద్యాసంస్థల దోపిడీ అరికట్టాలి

పోరుమామిళ్ల : పోరుమామిళ్ల మండలంలో ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు నిలువు దోపిడీకి పాల్పడుతున్నాయని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు వీరపోగు రవి ఆరోపించారు. మంగళవారం రవి మాట్లాడుతూ ప్రైవేటు విద్యాసంస్థలు విద్యార్థుల తల్లిదండ్రులను దోచుకుంటున్నా అధికారులు నిర్లక్ష్యంగా ఉన్నారని, విద్యాహక్కు చట్టానికి భిన్నంగా వేల రూపాయలు ఫీజులు వసూలు చేస్తున్నా అధికారులు నిద్రమత్తులో ఉన్నారన్నారు. గుర్తింపు లేకున్నా అడ్మిషన్లు చేస్తున్నారని వారికి అధికారుల అండదండలు ఉన్నాయన్నారు. ఫీజుల నియంత్రణపై చట్టం తేవాలన్నారు. విద్యాశాఖ అధికారులు తక్షణం స్పందించి విచారణ చేపట్టి, చర్యలు తీసుకోవాలని రవి కోరారు.

పర్యావరణంపై అవగాహన



మొక్కలను నాటుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

మైదుకూరు : విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ పర్యావరణంపై అవగాహన కలిగి ఉండాలని మైదుకూరులోని జెడ్పీ బాయ్స్ హైస్కూల్ ఇన్‌చార్జి హెడ్మాస్టర్ అక్కిశెట్టి మణిప్రకాశ్ అన్నారు. మంగళవారం పాఠశాల ఆవరణలో ఎన్‌సీసీ, స్కౌట్ విద్యార్థులతో కలిసి ఉపాధ్యాయులు మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి హెడ్మాస్టర్ మణిప్రకాశ్ మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యత ఉన్నప్పుడే వర్షాలు సమృద్ధిగా కురుస్తాయన్నారు. వాతావరణ కాలుష్యాన్ని నివారించేందుకు కూడా చెట్లను పెంచాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాఠశాల ఎన్‌సీసీ అధికారి మూడే సురేంద్ర నాయక్, ఉపాధ్యాయులు మీసాల మునెయ్య, గోశెట్టి రామమోహన్, సూర్యనారాయణరెడ్డి, వెంకటేశ్వర్లు, పద్మనాభయ్య పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

జమ్మలమడుగు రూరల్ : వీఆర్ఏల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని వీఆర్ఏల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ధైర్యం కోరారు. మంగళవారం జమ్మలమడుగులోని పెన్షనర్ల భవనంలో అధ్యక్షుడు ధైర్యం, మండల అధ్యక్షుడు గురుమోహన్ ఆధ్వర్యంలో వీఆర్ఏల నూతన కమిటీ ఎంపికను నిర్వహించారు. ఈ సందర్భంగా ధైర్యం మాట్లాడుతూ వీఆర్ఏల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆయన కోరారు. అనంతరం నూతన కమిటీ ఎంపికను నిర్వహించారు. ఉపాధ్యక్షుడు ఫెడ్రిక్ రాజు, ట్రెజరర్ బి.సుబ్బరాయుడు, ప్రధాన కార్యదర్శి శాంతయ్య, కమిటీ సభ్యులు చౌదయ్య, దానియల్, రాముసుబ్బయ్య, అరుణ్ పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహుడికి ప్రత్యేక పూజలు



పూజలందుకుంటున్న లక్ష్మీనరసింహస్వామి



కోలాటం ఆడుతున్న మహిళలు

ప్రొద్దుటూరు కల్చరల్ : మండల పరిధి నరసింహాపురం గ్రామంలోని పురాతన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారి జన్మనక్షత్రం స్వాతి సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజాకార్యక్రమాలను నిర్వహించారు. వేకువజామున లక్ష్మీనరసింహస్వామి, ఆంజనేయస్వామి మూలవిరాట్‌లకు పంచామృతాభిషేకం, కుంకుమార్చనలు చేశారు. విశేషంగా నూతన పట్టు వస్త్రాలతో, వెండికవచాలు, రంగురంగుల పూలు, గజమాలలు, వడమాలతో అలంకరించారు. భక్తులు ప్రదక్షణలు చేసి తమ మొక్కులు చెల్లించుకున్నారు. భక్తిగీతాలకు మహిళలు చేసిన కోలాటం ఆకట్టుకుంది. ఈ సందర్భంగా భక్తులకు అన్న ప్రసాద వినియోగం జరిగింది.

ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేని వాహనాలపై చర్యలు

ప్రొద్దుటూరు ఆర్టీఓ మురళీధర్



ప్రొద్దుటూరు క్రైం : ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకుండా తిరిగే ప్రైవేట్ విద్యాసంస్థల వాహనాలపై చర్యలు తీసుకుంటామని ప్రొద్దుటూరు ఆర్టీఓ పి. మురళీధర్ తెలిపారు. మంగళవారం ఆర్టీఓ మీడియాతో మాట్లాడారు. ప్రొద్దుటూరు ప్రాంతీయ రవాణాశాఖ కార్యాలయం పరిధిలో ఇప్పటి వరకు 285 వాహనాలకు ఎఫ్‌సీ చేసినట్లు తెలిపారు. సుమారు 97 శాతం పైగా విద్యాసంస్థల వాహనాలకు సామర్థ్య పరీక్షలను నిర్వహించామన్నారు. మిగిలిన వారు తప్పని సరిగా వారి వాహనాలకు ఎఫ్‌సీ చేయించుకోవాలన్నారు. ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకుండా తిరిగే నాలుగు వాహనాలపై కేసు నమోదు చేసినట్లు ఆర్టీఓ చెప్పారు. ఆయా విద్యాసంస్థల యాజమాన్యాలు తప్పని సరిగా నిబంధనలను పాటించాలన్నారు. 60 ఏళ్లు దాటిన వారిని డ్రైవర్లుగా పెట్టుకోరాదని తెలిపారు. బస్సు వెంట తప్పని సరిగా ఒక అటెండర్ ఉండాలని సూచించారు. డ్రైవరు, క్లీనర్ల పేర్లతో పాటు వారి సెల్ నంబర్లను బస్సులో రాయాలన్నారు. బస్సులపై పాఠశాల, కళాశాలల పేర్లను తప్పక రాయాలని తెలిపారు. పరిమితికి మించి విద్యార్థులు ప్రయాణించకుండా ఆయా యాజమాన్యాలు చర్యలు తీసుకోవాలన్నారు. వాహనాల డ్రైవర్లు హెవీ లైసెన్సులను కలిగి ఉండాలని చెప్పారు. విద్యా సంస్థల బస్సులను ప్రతి రోజూ తనిఖీ చేస్తున్నట్లు ఆర్టీఓ తెలిపారు.

విశ్వకర్మ యోజనపై అవగాహన



లబ్ధిదారు నుంచి దరఖాస్తు తీసుకుంటున్న అధికారులు

పోరుమామిళ్ల : పేదవానికి బంగారు భవిష్యత్తు అందించేందుకు ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకం ఉపయోగపడుతుందని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రాజంపేట రీజనల్ మేనేజర్ మురళీనాయక్ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని ఎస్‌బీఐ రంగసముద్రం శాఖలో విశ్వకర్మ యోజన పథకం కోసం దరఖాస్తు చేసుకున్న వారికి, ఖాతాదారులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఆర్ఎం మురళీనాయక్ మాట్లాడుతూ ఉపాధి లేని వృత్తి పనివాళ్లలకు విశ్వకర్మ యోజన ద్వారా రుణ సదుపాయం కల్పించేందుకు ప్రధానమంత్రి ఈ పథకం తీసుకవచ్చారన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి రుణాలు మంజూరు చేసి వారి అభివృద్ధికి సహకరిస్తామన్నారు. రుణాలు తీసుకున్నవారు సకాలంలో తిరిగి చెల్లిస్తే వారికి మరిన్ని రుణాలు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో రాజంపేట చీఫ్ మేనేజర్ జాఫర్ మొహిద్దీన్, రంగసముద్రం ఎస్‌బీఐ మేనేజర్ నరేంద్ర, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలను విడుదల చేయాలి



మాట్లాడుతున్న మెడికల్ కాంట్రాక్ట్ యూనియన్ నాయకుడు సుబ్బరాయుడు

ప్రొద్దుటూరు క్రైం : మెడికల్ కాంట్రాక్ట్ ఉద్యోగుల పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలని మెడికల్ కాంట్రాక్ట్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు కోరారు. స్థానిక జిల్లా ఆస్పత్రిలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంట్రాక్ట్ కింద పని చేస్తున్న ఎఫ్ఎన్ఓలు, ఎంఎన్ఓలు, శానిటరీ సిబ్బందికి నాలుగు నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. సంబంధిత కాంట్రాక్టర్ వీరికి వేతనాలు చెల్లించకుండా నిర్లక్ష్యం చేస్తున్నాడని తెలిపారు. ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. శానిటేషన్ సిబ్బందికి సంబంధించిన పీఎఫ్ సొమ్మును అజిల్ కంపెనీ, చైతన్య జ్యోతి కంపెనీలు సరిగా చెల్లించలేదని చెప్పారు. క్యాజువల్ లీవ్‌లు కూడా అమలు చేయకుండా సూపర్‌వైజర్లు కార్మిక చట్టాలకు తూట్లు పొడుస్తున్నారన్నారు. ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో మెడికల్ యూనియన్ ఉద్యోగ కార్మికులు లత, రాజమ్మ, ప్రమీల, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : నిబంధనలు పాటించని ప్రైవేటు, కార్పొరేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ప్రొద్దుటూరు నియోజకవర్గ అభివృద్ధి వేదిక కన్వీనర్ నాగరాజు ఎంఈఓ శోభారాణికి వినతి పత్రం అందించారు. బుధవారం ఆమె కార్యాలయంలో కలిసి అధిక ఫీజులు వసూలు చేయడంతో పాటు నిబంధనలకు వ్యతిరేకంగా పాఠశాలలోనే పుస్తకాలు విక్రయిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను దోపిడీ చేస్తున్నారని ఎంఈఓకు వివరించారు. 25 శాతం పేద విద్యార్థులకు విద్యాసంస్థలు ఉచిత విద్యను అందించడం లేదని, విద్యార్థులకు అవసరమైన మౌళిక వసతులు కల్పించడం లేదని, ఆటస్థలాలు లేవని, సరైన పాఠశాల క్యాంపస్ లేవన్నారు. నిబంధనలకు వ్యతిరేకంగా నడుచుకుంటున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు. వేదిక సభ్యులు మహబూబ్ బాష, రసూల్‌బి తదితరులు పాల్గొన్నారు.

చల్లంగ చూడు.. గాలివీటమ్మా



గాలివీడు : ప్రత్యేక అలంకరణలో గాలివీటమ్మా



చిట్వేలి: స్వామివారి గ్రామోత్సవ దృశ్యం


గాలివీడు : గాలివీటమ్మా.. చల్లంగ చూడమ్మా అంటూ భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల కొంగు బంగారంగా కోరిన కోర్కెలు తీర్చే గాలివీటమ్మ జాతర మంగళవారం వైభవంగా ముగిసింది. మండల కేంద్రంలోని కుషావతి నదీ తీరాన వెలసిన శ్రీ గాలివీటి గంగమ్మ జాతర అత్యంత వైభవోపేతంగా జరిగింది. సోమవారం సద్దలకూడు నైవేద్యంతో ప్రారంభమైన జాతర విశేష పూజలతో ప్రత్యేక అలంకరణ నడుమ నిండు తిరునాలగా మారింది. మంగళవారం ఉదయం మహిళలు పెద్ద ఎత్తున బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పెద్దగొడుగు స్వామి తిరునాలలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

ఘనంగా గ్రామోత్సవం

చిట్వేలి: మండల పరిధిలోని నక్కలపల్లిలో వెలసిన శ్రీశంకర భవానీ స్వామి గ్రామోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆదివారం నుంచి ప్రారంభమైన స్వామివారి తిరునాల సోమవారం రాత్రితో ఘనంగా ముగిసింది. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ముగిసిన నాగారపమ్మ జాతర

సుండుపల్లె: మండల కేంద్రంలోని పెదనేని కాలువ గ్రామ పంచాయతీ బండకాడ ఈడిగపల్లెలో వెలసిన శ్రీ నాగారపమ్మ తల్లి జాతర మహోత్సవం మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా మండలంలోని పలు గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. జాతరలో చాందినీ బండ్లు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. అసాంఘిక కార్యకలాపాలు జరుగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు.



సుండుపల్లె: జాతరలో పాల్గొన్న భక్తులు

ఆలయ భూములు వేలం పాట వాయిదా

పెద్దముడియం : మండలంలోని చిన్నముడియం గ్రామంలోని శ్రీ ఆంజనేయస్వామి దేవాలయానికి సంబంధించిన 16 ఎకరాల భూముల వేలం పాటను వాయిదా వేసినట్లు ఆలయ ఈవో విశ్వనాథరెడ్డి తెలిపారు. ఆలయ ఇన్‌స్పెక్టర్‌కు మరో చోట భూముల వేలం పాట ఉండటంతో ఇక్కడికి రాకపోవడంతో వేలం పాటను రద్దు చేసినట్లు తెలిపారు. మరో 10 రోజుల్లో భూముల వేలం పాట వేయుటకు మరో తేదీని నిర్ణయిస్తామని తెలిపారు.

వృద్ధులకు అన్నదానం



వృద్ధులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న పెద్దవెంకటరెడ్డి కుటుంబ సభ్యులు

లింగాల : మండలంలోని ఇప్పట్ల గ్రామ సమీపంలోని లీలావతి చారిటబుల్ ట్రస్ట్ వృద్ధాశ్రమంలో మంగళవారం వృద్ధులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. బోనాల గ్రామానికి చెందిన పోచం రెడ్డి పెద్ద వెంకటరెడ్డి 7వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన కుమారుడు డీపీఎంఓ ఇ.వి.రమణారెడ్డి, ఉపాధ్యాయుడు పద్మనాభరెడ్డిలు వృద్ధులకు అన్నదాం నిర్వహించి స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, వృద్ధులు, ట్రస్ట్ నిర్వాహకులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీపై శిక్షణ

ఎర్రగుంట్ల : పట్టణంలోని ఎంపీడీఓ సభా భవనంలో మండల పరిధిలోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులందరికి ఫిజియోథెరపీపై ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు మండల విద్యాధికారులు శివప్రసాద్, వెంకటేశ్వర్లు తెలిపారు. నిజాం హస్పిటల్ హైదారబాదు నుంచి వచ్చిన డాక్టర్ సంతోష్ కుమార్ శిక్షణ ఇచ్చారు. సెల్‌ఫోన్ వాడకంపై తగు సూచనలు అందించారు. ఫిజియోథెరిపీ అవసరం, వాటి అవశ్యకతను తెలియజేశారు.

భాష్యం పాఠశాలలో పుస్తకాలను సీజ్ చేసిన ఎంఈఓ

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వైఎంఆర్ కాలనీలోని భాష్యం పాఠశాలలో నిబంధనలకు విరుద్ధంగా విక్రయిస్తున్న పాఠ్య పుస్తకాలను, సామాగ్రిని ఎంఈఓ సావిత్రమ్మ మంగళవారం సాయంత్రం సీజ్ చేశారు. పట్టణంలోని పలు ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు నిబంధనలకు విరుద్ధంగా విద్యాసామాగ్రి, యూనిఫాం, పుస్తకాలను తదితర వాటిని విక్రయిస్తున్నారని రాయలసీమ స్టూడెంట్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జగన్ ..డీఈఓ అనురాధకు ఫిర్యాదు చేయడం జరిగింది. డీఈఓ ఆదేశాల మేరకు ఎంఈఓ భాష్యం పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో నిబంధనలకు విరుద్ధంగా ఉన్న పుస్తకాలు, బ్యాగ్‌లు, నోట్ పుస్తకాలు, డైరీ తదితర విద్యాసామాగ్రిని పరిశీలించి సీజ్ చేశారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళుతున్నట్లు ఎంఈఓ తెలిపారు.

మంత్రి, ఎమ్మెల్యేలను కలిసిన వైవీయూ వీసీ

వైవీయూ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణా ,యువజన క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రామప్రసాద్ రెడ్డిని యోగివేమన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వైపీ వెంకటసుబ్బయ్య మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. యోగివేమన విశ్వవిద్యాలయం అభివృద్ధికి సహకారం అందించాలని కోరారు. రాయచోటిలో యోగివేమన విశ్వవిద్యాలయం పోస్ట్ గ్రాడ్యుయేషన్ సెంటర్ స్థితిగతులను వివరించారు. ప్రభుత్వ విధానాల ప్రకారం విశ్వవిద్యాలయ ప్రగతికి పూర్తి సహకారం అందిస్తామని మంత్రి స్పష్టం చేశారని వీసీ తెలిపారు. అనంతరం కడప శాసనసభ్యురాలు ఆర్.మాధవీరెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కమలాపురం శాసనసభ్యులు పుత్తా కృష్ణ చైతన్యరెడ్డి, నాయకులు పుత్తా నరసింహారెడ్డిలను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

అధిక ఫీజుల వసూలుపై చర్యలు తీసుకోవాలి

కడప ఎడ్యుకేషన్: జిల్లాలో అధిక ఫీజులను వసూలు చేస్తున్న కార్పొరేట్ స్కూళ్లపై చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా స్టూడెంట్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు జగదీష్, జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజ్‌లు డిమాండ్ చేశారు. ఈ విషయమై మంగళవారం డీఈఓ మర్రెడ్డి అనురాధను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని ప్రైవేటు, కార్పొరేట్ యాజమాన్యాలు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అడ్మిషన్ల పేరుతో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు.

ఈశ్వరరెడ్డినగర్ వాసులకు ఎమ్మెల్యే భరోసా



ఈశ్వరరెడ్డినగర్ వాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు క్రైం : బైపాస్‌రోడ్డు సమీపంలోని ఈశ్వరరెడ్డినగర్ వాసులు మంగళవారం ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డిని కలిశారు. ఇళ్లు ఖాళీ చేయాలని అటవీశాఖ అధికారులు నోటీసులు ఇచ్చినట్లు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. తాము సుమారు 15 ఏళ్ల నుంచి నివాసాలను ఏర్పాటు చేసుకొని ఇక్కడ ఉంటున్నట్లు చెప్పారు. ఇప్పుడు ఉన్నట్టుండి ఇళ్లు ఖాళీ చేయమని చెబితే ఎక్కడికి వెళ్లాలని వారు ఎమ్మెల్యే వద్ద మొర పెట్టుకున్నారు. ఎవరూ భయపడవద్దని, అటవీశాఖ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు.

ఎమ్మెల్యేను కలిసిన అంగన్‌వాడీలు

ప్రొద్దుటూరు : ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డిని మంగళవారం అంగన్‌వాడీ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు మంజుల ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు కలిశారు. ఎమ్మెల్యేకు అసోసియేషన్ సభ్యులు శాలువా కప్పి సన్మానించి, పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకురాళ్లు సుభాషిణి, చంద్రిక, గౌసియా, సునీత, శాంతకుమారి, చంద్రావతి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించాలి



రాజుపాలెం విలేజ్ హెల్త్ క్లినిక్‌లో రికార్డులను పరిశీలిస్తున్న జాతీయ బృందం

బద్వేలు అర్బన్ : ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు వైద్య సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని నేషనల్ క్వాలిటీ కంట్రోల్ అసెస్‌మెంట్ బృందం సభ్యులు డాక్టర్ ప్రేమాన్షుపాండ్యా, డాక్టర్ సిద్ధార్థశుక్ల పేర్కొన్నారు. తొట్టిగారిపల్లె పీహెచ్‌సీ పరిధిలోని రాజుపాలెం పంచాయతీలోని విలేజ్ హెల్త్‌క్లినిక్‌ను మంగళవారం జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్‌కు సంబంధించిన నేషనల్ క్వాలిటీ కంట్రోల్ అసెస్‌మెంట్ బృందం సందర్శించింది. బృందంలోని వైద్యులు మాతాశిశు సంరక్షణ, వ్యాధినిరోధక టీకాల పంపిణీ, హెల్త్‌క్లినిక్ నిర్వహణ, మందుల పంపిణీ వంటి అంశాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్త్రీ ఆరోగ్యం, శిశువు ఆరోగ్యంపై దృష్టి సారించి మాతాశిశు మరణాలు లేకుండా చూసేందుకు కృషి చేయాలని కోరారు. ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించడమే లక్ష్యంగా ప్రజారోగ్యాన్ని మెరుగుపరిచేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ వినయ్‌కుమార్, క్వాలిటీ కంట్రోల్ సభ్యులు సరళాదేవి, హెల్త్ ఎడ్యుకేటర్ వెంగయ్య, హెల్త్ సూపర్‌వైజర్ వెంకటమ్మ, సీహెచ్ఓ ప్రభావతి, శుభలేఖ, రాధ, హెల్త్ అసిస్టెంట్ జనార్ధన్, ఏఎన్ఎంలు, 108 సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు బాసటగా కిసాన్ సమ్మాన్ నిధి



మాట్లాడుతున్న కేవీకే అధిపతి డాక్టర్ ఎం.బాలకృష్ణ

మైదుకూరు : కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న కిసాన్ సమ్మాన్ నిధి రైతులకు ఎంతో బాసటగా నిలుస్తుందని మండలంలోని వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త, అధిపతి డాక్టర్ ఎం.బాలకృష్ణ తెలిపారు. మంగళవారం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా 17వ విడత కిసాన్ సమ్మాన్ నిధుల విడుదల సందర్భంగా కేవీకేలో రైతులను సమావేశపరిచి ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించే ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ బాలకృష్ణ మాట్లాడుతూ అర్హులైన ప్రతి రైతుకు ఈ నిధులు అందాల్సిన అవసరం ఉందన్నారు. కేవీకే విస్తరణ విభాగం శాస్త్రవేత్త డాక్టర్ శ్రీవిద్యారాణి మాట్లాడుతూ కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా రైతులు ఏడాదికి పొందే రూ.6వేలు లబ్ధి వారికి ఎంతో సాయంగా ఉండి, పెట్టుబడులను తగ్గిస్తుందని తెలిపారు. ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ ఫిరోజ్ హుస్సేన్ మాట్లాడుతూ రసాయనిక ఎరువుల వాడకం తగ్గించడం వల్ల భూమి సారాన్ని కాపాడవచ్చన్నారు. గృహ విజ్ఞాన విభాగం శాస్త్రవేత్త డాక్టర్ కాంతిశ్రీ మాట్లాడుతూ ప్రభుత్వం అందించే సబ్సిడీలు, నిధుల తోడ్పాటుతో పాటు విలువ పెంపొందించే సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని సూచించారు. దీని వల్ల ఆర్థికంగా మరింత ముందుకు పోవచ్చన్నారు. కార్యక్రమంలో గ్రోమోర్ ఏరియా మేనేజర్ గౌస్, అగ్రి ఫ్రెండ్ సీఈఓ శివశంకర్‌రెడ్డి, కోరమండల్ ఏరియా మేనేజర్ గంగయ్య, అభ్యుదయ రైతు ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల సమస్యలపై వినతి



ప్రభాకర్‌రెడ్డికి వినతి పత్రం ఇస్తున్న కార్మికులు

పోరుమామిళ్ల : పంచాయతీ కార్మికుల సమస్యలపై మంగళవారం జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్ రెడ్డికి వినతిపత్రం ఇచ్చినట్లు ఏఐటీయుసీ జిల్లా కార్యదర్శి మస్తాన్ తెలిపారు. ఏఐటీయుసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరి బాదుల్లా ఆధ్వర్యంలో పోరుమామిళ్ల, రంగసముద్రం పంచాయతీల కార్మికులతో కలసి డీఎల్‌పీఓ ప్రభాకర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశామన్నారు. ఆన్‌లైన్ టెండర్ల విధానం వద్దని, ఇప్పుడున్న విధానాన్నే కొనసాగించాలన్నారు. ఆన్‌లైన్ టెండర్ల పేరుతో ఉద్యోగ భద్రత లేదన్నారు. నామమాత్రపు వేతనాలతో కార్మికులు శ్రమ దోపిడీకి గురవుతున్నారన్నారు. సుప్రీంకోర్టు తీర్పు మేరకు సమానపనికి సమాన వేతనం చెల్లించాలని, ప్రభుత్వాలు కోర్టు తీర్పును అమలు చేయాలని మస్తాన్ కోరారు. జిల్లాలో అత్యధిక పంచాయతీల్లో పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించడం లేదని, కొన్ని పంచాయతీల్లో కార్మికుల వేతనాల నుండి కటింగ్ చేసిన డబ్బు వారి ఖాతాల్లో జమ చేయడం లేదని ఆరోపించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వారిపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు.

చెరువా.. డంపింగ్‌యార్డా..?

బద్వేలు అర్బన్ : పట్టణంలోని కొంతమంది వ్యాపారుల నిర్లక్ష్యం వలన పోరుమామిళ్ల బైపాస్ రోడ్డుక్కు ఇరువైపులా ఉన్న నాగులచెరువు డంపింగ్ యార్డును తలపిస్తోంది. రోడ్డుకు ఇరువైపులా చెత్త, వ్యర్థాలు, జంతు కళేబరాలతో నిండిపోయి కంపుకొడుతోంది. అలాగే చెరువులోకి కూడా పెద్ద ఎత్తున వ్యర్థాలు చేరాయి. దీంతో బైపాస్‌రోడ్డులో ఉదయం, సాయంత్రం వేళలలో వాకింగ్‌కు వెళ్లే పాదచారులు దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే వ్యర్థాలు వేస్తుండటంతో చెరువు కలుషితమవుతోందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి చెరువులో వ్యర్థాలు వేయకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.



నాగులచెరువు వద్ద భారీగా పేరుకుపోయిన వ్యర్థాలు

గుండె జబ్బులను నిర్లక్ష్యం చేయవద్దు



గుండె జబ్బుల గురించి వివరిస్తున్న డాక్టర్ వెంకటచెంచయ్య

ప్రొద్దుటూరు క్రైం : గుండె జబ్బులను నిర్లక్ష్యం చేయవద్దని కార్డియాలజిస్టు డాక్టర్ వెంకట చెంచయ్య తెలిపారు. స్థానిక ఎన్జీఓహోంలో మంగళవారం సాయంత్రం ధ్రితి హాస్పిటల్స్ ఆధ్వర్యంలో గుండె జబ్బులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ధ్రితి హాస్పిటల్స్ వైద్యుడు వెంకటచెంచయ్య గుండె జబ్బులపై వీడియో ప్రొజెక్టర్ ద్వారా వివరించారు. గుండె జబ్బు అనేది వృద్ధాప్యంలో వచ్చే వ్యాధి కాదని డాక్టర్ తెలిపారు. చిన్న వయస్సులోనే గుండె జబ్బులు వస్తున్నాయని చెప్పారు. ఆడవారితో పోలిస్తే మగవారిలో ఈ జబ్బులు రావడానికి ఎక్కువగా అవకాశాలు ఉన్నాయన్నారు. అధిక రక్తపోటు, మధుమేహ వ్యాధిగ్రస్తులు, ధూమపానం చేసేవారు, అధిక చెడు కొవ్వు వల్ల కలిగే ఊబకాయం, ఎక్కువగా ఆల్కహాల్ తీసుకునే వారిలో అనేక రకాల గుండె జబ్బులు వస్తాయన్నారు. ప్రతి రోజు వ్యాయామం చేయడంతో పాటు వివిధ రకాల పండ్లు, కూరగాయలు తినాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎన్జీఓ అధ్యక్షుడు కేజే రఘురామిరెడ్డి, కార్యదర్శి రామసుబ్బయ్య, సిబ్బంది పాల్గొన్నారు.